# పెళ్ళి ముచ్చట్లు

ఉష తన భర్త కృష్ణవంశీతో కలిసి, చెల్లెలి పెళ్ళికని కాకినాడ వచ్చింది. వాళ్ళ పుట్టిల్లు చాలా పెద్దది. సరైన ఫంక్షన్ హాల్ దొరకక, పెళ్ళి స్వగృహంలోనే చేస్తున్నారు. పెళ్లి రేపనగా చుట్టాలంతా వచ్చేశారు. ఎంత పెద్ద ఇల్లైనా, అందరూ ఒకేసారి వచ్చేస్తే ఏం సరిపోతుంది? ఇంట్లో చాలా హడావిడిగా ఉంది. ఆరోజు సాయంకాలం చుట్టాలంతా కలిసి డాబా మీద మాట్లాడుకుంటున్నారు.

ఇంతలో "ఉషా! మీ అమెరికా అత్తయ్య వచ్చింది, నిన్ను కిందకి రమ్మంటున్నారు" అంటూ ఒక అమ్మాయి చెప్పింది.

ఉష కిందకి వచ్చి, అక్కడున్న ఒకామెను చూసి "హాయ్ అత్తయ్యా! చాలా సంతోషం, మా అన్నయ్య పెళ్లికీ, నా పెళ్లికీ రాలేకపోయినా, కనీసం మా ఇంట్లో జరిగే ఆఖరి పెళ్లికైనా వచ్చావు" అంటూ కొంత ఆప్యాయత, కొంత నిష్ఠూరం కలబోసి మాట్లాడింది.

"మీ ఆయన ఏడీ? ఒక సారి చూపించు" అంది అత్తయ్య.

అక్కడికి వచ్చిన ఒక పిల్లాడ్ని పిలిచి "బాబూ! డాబామీద కృష్ణవంశీ అని ఒకాయన ఉంటారు. ఉష రమ్మన్నదని" చెప్పి తీసుకురా! అని పురమాయించింది.

"ఎవరండీ ఆ మెల్లకన్నాయనేనా?" అన్నాడు ఆ అబ్బాయి.

"అంతా నా ఖర్మ" అని లోపల బాధపడింది ఉష.

"ఏమిటే మీ ఆయనకి మెల్ల ఉందా?" అని పరిహాసం చేసింది అత్తయ్య. ఈ లోపులో కృష్ణవంశీ కిందకి వచ్చాడు. "మా అమెరికా అత్తయ్య అని చెప్తుంటాను కదా! అవిడే ఈవిడ" అని పరిచయం చేసింది ఉష.

"ఉష తరచు చెపుతూంటుంది. ఓ సారి తన పుట్టిన రోజుకి గ్రీటింగ్స్ పంపారు కదా! అప్పుడు తను చాలా సంతోషించింది" అన్నాడు వంశీ.

రాత్రి భోజనాలైన తర్వాత, కొంత మంది డాబా మీదే పడుకున్నారు.

తెల్లారగట్ల వంశీ నిద్రలో నడుస్తూవెళ్లి, ఉషా వాళ్ల అమెరికా అత్తయ్యకి దగ్గర్లో ఉన్న కొంచెం ఖాళీ స్థలంలో పడుకున్నాడు. కొంచెం సేపటికి అవిడకి మెలుకువ

వచ్చి చూస్తే, దగ్గర్లో వంశీ పడుకుని ఉన్నాడు. పైగా "ఉషా! ఉషా!" అని కలవరిస్తున్నాడు. ఇతను ఇక్కడికి ఎలా వచ్చాడా? అని ఆశ్చర్యపోయి ఉషని లేపి అతన్ని చూపించింది.

"నువ్వు నా దగ్గర పడుకో అత్తయ్యా! పొద్దున్న అన్ని విషయాలు నీకు చెపుతాన్లే!" అంది ఉష.

ఉష దగ్గిర పడుకుని "ఏమిటో! ఏం చెపుతుందో పొద్దున్న" అనుకుంటూ నిద్రపోయింది ఆవిడ.

ఆ తర్వాత ఉషకి నిద్ర పట్టలేదు. "అసలే మెల్ల అని ఏడుస్తుంటే, వంశీకి నిద్రలో నడిచే అలవాటు కూడా ఉంది. భర్తవల్ల తన పరువు పోతోందని" బాధపడింది ఉష. ఈ అలవాటుందని ఇప్పటి దాకా తన వారికి ఎవ్వరికీ తెలియదు. చెపితే బాధపడతారని చెప్పలేదు.

మళ్ళీ మెలకువ వచ్చిన అత్తయ్య ఉషని చూసి, "ఏమిటే నిద్ర పో! ఏమైనా ఉంటే పొద్దున్న మాంట్లాడదాంలే!" అంది.

పొద్దున్న అత్తయ్యని డాబా మీదకి తీసుకెళ్ళి, "అంతా నా ఖర్మ అత్తయ్యా! మా ఆయనకు నిద్రలో నడిచే అలవాటుంది! అందుకే అక్కడికి వచ్చి పడుకునుంటాడు. నువ్వు చూసావు కనుక ఫర్వాలేకపోయింది. అదే ఇంకొకళ్లైతే నా పరువేంగాను చెప్పు? అసలు ఈ మెల్ల కన్ను వాడొద్దంటే 'ఎమ్. టెక్. గోల్డ్ మెడలిస్ట్ అనీ, కుడికన్ను మెల్ల ఉంటే మగాడికి అదృష్టం' అంటూ నాకు కట్టపెట్టారు. నువ్వు కనుక అప్పుడు మన దేశంలో ఉండి వుంటే అప్పుడే అడ్డుపడే దానివి, నాకీ సంబంధం అవకపోను. అయినా నేను దురదృష్టవంతురాల్ని" అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది ఉష.

"తప్పు! పెళ్లింట్లో ఏడవకూడదు. అంతా దైవ ఘటన. ఏం చేస్తాం? అంటూ ఓదార్చింది అత్తయ్య.

"అసలు ఈ వంశీకి నిద్రలో నడిచే అలవాటు నిజంగా ఉందా? లేకపోతే భర్తని తప్పుగా అర్థం చేసుకుంటామని ఉష సర్దిచెపుతోందా? అని అనుకుంది అత్తయ్య.

మధ్యాహ్నం భోజనాలైన తర్వాత, ఒకావిడ చేత త్యాగరాజ కీర్తనలు పాడించారు. కృష్ణవంశీ ఆవిడ్ని 'సొగసు చూడతరమా!' అనే కీర్తన పాడమని అడిగాడు.

'మంచి కీర్తన కదా!' అన్నట్లు ఎవర్నో చూసి నవ్వేడు. అత్తయ్య తనని చూసే నవ్వేడను కొంది. కాస్సేపటి తర్వాత 'ఎందుకు దయరాదురా' అనికూడా అడిగిపాడించు కున్నాడు.

ఈ కీర్తన పేర్లు చూసి 'అసలు ఈ కృష్ణవంశీ ఏమైనా కొంత కావాలనే అల్లరి చేస్తున్నాడేమో'' అనుకుంది అత్తయ్య. ''సరే చూద్దాం! ఇంకా ఉంటాం కదా'' అనుకుంది ఆవిడ.

చాలా మంది ఆడవాళ్ళు సాయంకాలం నాలుగున్నరకి ముస్తాబై షామియానాలో కూర్చున్నారు. ఉష అత్తయ్య మాత్రం పెద్దగా ముస్తాబు కాలేదు. ఆవిడ సహజ సౌందర్యవతి. తెల్ల చీర కట్టుకుని, అమెరికన్ డైమండ్ నెక్లెస్‌తో, తలలో మల్లెపూలు పెట్టుకుని ఒకచోట కూర్చుంది. చాలామంది ఆవిడకేసే చూస్తున్నారు.

''ఓ అత్తయ్యా! నువ్వా? ఎవరో అప్సరస అనుకున్నాను నేను'' అంటూ అక్కడకొచ్చిన ఉష, నవ్వుతూ అంది.

''అప్సరస అనుకోవడమేమిటే? నేను అప్సరసనే. మీరు మాత్రం మానవులు'' అంది ఆమె కూడా నవ్వుతూ.

''అత్తయ్యా! నువ్వు నిజంగా అప్సరసవే అని నాకు తెలుసు. అంతేకాదు నువ్వు కాలేజీలో చదివే రోజుల్లో మగపిల్లలు నీ క్లాసు ముందు నుంచి వెడుతూ, కావాలని పుస్తకాలు కింద పడేసి అవి తీసుకుంటున్నట్లు నటిస్తూ, నిన్ను చూసేవారనీ, అందరూ నీ ఆటోగ్రాఫ్ తీసుకునేవారనీ నాకు తెలుసు'' అంది ఉష.

''ఏమిటేవ్! చాలా తెలివైనదానవేనే! నా కాలేజీ విషయాలు కూడా తెలుసుకున్నావా? అయినా నీకివన్నీ ఎవరు చెప్పారు?'' అంటూ ఆశ్చర్యంగా అడిగింది.

''ఒకసారి పెద్దత్తయ్య ఎవరితోనో నీ అందం గురించి చెపుతూ ఈ విషయాల్నీ చెప్పింది. అప్పుడు విన్నాను. ఇంతకీ నిజమే కదా'' అంది ఉష.

''నిజమేనే ఉషా! అప్పట్నుంచే నాకు మొగాళ్ళమీద సదభిప్రాయం పోయింది'' అంది అత్తయ్య.

''ఏమిటయ్యా వంశీ! మరదలు పెళ్ళిలో నువ్వు ఏ పనీ చెయ్యటం లేదు. ఇంటికి పెద్దల్లుడన్న తర్వాత శుభకార్యాలలో సహాయం చెయ్యకపోతే ఎలా?'' అన్నారట ఎవరో.

అందుకని ఒక ట్రేలో టీ పట్టుకొచ్చి అందరికీ అందివ్వడం మొదలుపెట్టాడు వంశీ. ఆ ట్రే కింద అంటుకొని ఉన్న కొన్ని టీ చుక్కలు ఉషా వాళ్ల అత్తయ్య తెల్ల చీర మీద పడ్డాయి. కృష్ణవంశీ పాలు తీసుకొచ్చి, "ఆ టీ చుక్కల పై వెయ్యమనీ లేకపోతే తర్వాత అవి తొందరగా పోవు" అన్నాడు.

"ఫర్వాలేదు" అంది ఆవిడ. అక్కడితో అయిపోతే గొడవే లేకపోను.

పక్కన 'అంతాక్షరి' పాటలు పాడుకుంటున్న పిల్లల్లో ఒకడు "పాలు కావాలా మురిపాలు కావాలా" అనీ, తర్వాత కొంచెం సేపటికి ఇంకొకడు "తెల్ల చీర కట్టుకున్న దెవరి కోసమూ మల్లెపూలు పెట్టుకున్నది ఎవరి కోసమూ" అంటూ పాడారు.

'ఇదంతా కృష్ణవంశీ చేయిస్తున్నాడేమో!" అని అనుమానం వచ్చింది అత్తయ్యకు.

"వంశీగారూ! ఏదైనా మంచి సంబంధం ఉంటే చెప్పండి" అని అడుగుతూ "పిల్ల చాలా అందంగా ఉంది, కానీ డిగ్రీ పూర్తి అవలేదు' అని చెప్పాడు, ఉష కజిన్ ఒకతను.

"కేవలం అందం ఉంటే చాలదండీ! ఈ రోజుల్లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ చేసిన ఆడపిల్లలకి సంబంధాలు కుదర్చడం కష్టంగావుంది" అన్నాడు వంశీ.

"కేవలం అందం ఉంటే చాలదు" అన్న మాటలు ఉష అత్తయ్య విని, తననే అంటున్నాడేమో అనుకుంది. మగాళ్ల మీద సదభిప్రాయం లేకపోతే అంతేమరి!

ఈ పెళ్ళిలో అత్తయ్య ప్రాణం విసిగిపోతోంది. ఆవిడ ఆలోచించింది. "పోనీమెల్ల వల్లే తనని చూసినట్లు ఉండవచ్చు. ట్రే కింద టీ చుక్కలు చూడలేదా ఇతను? కేవలం అందం ఉంటే చాలద"ని తనని ఉద్దేశించి అనలేదా? అయినా ఇతనిపేరు "కృష్ణవంశీ!" కృష్ణ వంశీయులు అల్లరి చేయకుండా ఉంటారనుకోవడానికి వీల్లేదు!"

ఇంక ఉండబట్టలేక ఉషని పిలిచి, "నీ భర్తకేమైనా ఆకతాయితసం ఉందా?" అని అడిగింది అత్తయ్య.

విషయం తెలుసుకున్న ఉష అంది, "అత్తయ్యా! మా టైమ్ బాగాలేదు. ఆ పాటలు ఎవరో పిల్లలు పాడితే ఆయనేం చేస్తారు? పైగా నీ అందం గురించి మాట్లాడే రకం కాదు మా ఆయన" అంది ఉష.

"ఏమనుకోకు అన్ని సంఘటనలు చూసి నా మనసు బాధపడింది. అందుకే ఇంక ఆపుకోలేక నిన్ను అడిగాను" అంది అత్తయ్య.

పెళ్లైపోయింది. ఆరోజు రాత్రి మాత్రం దేవుడి దయవలన వంశీ నిద్రలో నడవలేదు. అతను కూడా మంచివాడే. అప్పుడప్పుడే అలా నడుస్తాడు. ప్రతీ రోజూ నిద్రలో లేచినడవడు.

ఆ మర్నాడు అంతా ప్రయాణమై వెడుతున్నారు. ఉషని పుట్టింట్లో వదిలేసి, కృష్ణవంశీ వెడుతున్నాడు. అందరికీ, చెప్పడమైంది. ఇంక ఉషా వాళ్ల అత్తయ్యకి వెళ్లి వస్తానండీ' అని చెప్పడానికి ఆవిడ దగ్గరికి వచ్చాడు అదే సమయానికి ఉష వాళ్ల అత్తయ్యతో "చాలా సంతోషం అత్తయ్యా! చాలా రోజులైంది నిన్ను చూసి. ఈ పెళ్లికైనా వచ్చావు నువ్వు" అంటోంది. అక్కడికి వచ్చిన కృష్ణవంశీ, ఉష అత్తయ్యతో అన్నాడు "మీరూ సంతోషించాలి. మనం ఒకర్నొకరు కిస్ చేసుకోనందుకు".

ఆ 'కిస్' అన్న మాటతో ఆవిడ ఓపిక పూర్తిగా నశించింది. సాచి పెట్టి కృష్ణవంశీ దవడపై ఒక లెంపకాయ లాగింది. కృష్ణవంశీకి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. ఉష అదృష్టం, అత్తయ్య కొట్టడం ఎవ్వరూ చూడలేదు.

భర్తతో పెళ్లికి బయల్దేరే ముందు చెప్పింది ఉష. "మీకు 'మ' పలకదు 'మ'కి బదులు 'క' అంటారు. 'మ'తో మొదలయ్యే మాటలు మాట్లాడవద్దు" అని.

వద్దంటే వినే రకమా? "మిస్ అనడానికి బదులు 'కిస్' అని ఒక లెంపకాయ లఫ్లీగా తిన్నాడు. దవడ అదిరిపోయింది.

మెల్ల ఒకటే అయితే భరించొచ్చు. నిద్రలో నడక! 'మ' పలక్కపోనడం, పాపం! ఉష ఎన్నింటికని ఏడుస్తుంది?

"సరే మీరు వెళ్లండి" అని కృష్ణవంశీని సాగనంపి, వెనక్కి వచ్చి, వాళ్ల అత్తయ్యతో అంది, "ఏంటి అత్తయ్యా! ఇంటల్లుడ్ని అలా కొట్టేసావు? ఆయనకి 'మ' పలకదు. అందుకని 'మిస్'కి బదులు 'కిస్' అన్నారు. అంతా నా ఖర్మ".

"వెరివెరీ సారీ... ఉషా!" అంది. "ఇంత మంచి పిల్లకి ఇలాంటి వాడా భర్త... ఇంకా వీడికెన్ని అవలక్షణాలున్నాయో" అని బాధపడింది అత్తయ్య.

వెంటనే అన్న గారి దగ్గరికి వెళ్లి "అన్నయ్యా! సంబంధం

కుదుర్చుకునేటప్పుడు అన్నీ జాగ్రత్తగా చూసుకుని కుదుర్చుకోవాలి'' అంది.

''ఏమిటే నువ్వనేది? ఇప్పుడు తీసుకొచ్చిన రెండో అల్లుడుకి ఏమైనా లోపాలున్నాయంటావా?'' అని అడిగారు ఉష నాన్నగారు.

''రెండోదాని విషయం కాదు. మెల్ల ఉంటే అదృష్టం అంటూ ఉష వద్దన్నా, వినకుండా ఆ సంబంధం కుదిర్చారట దానికి. అతను నిద్రలో నడుస్తాడట. పైగా 'మ' పలకదట'' అంది ఉష అత్తయ్య.

''ఈ విషయాలన్నీ ముందే నాకెలా తెలుస్తాయే?'' అన్నారాయన.

''అందుకే సంబంధం కుదుర్చుకునే ముందు ఆ పిల్లాడ్ని ఏ లాడ్జికో తీసుకువెళ్లి మనతో పాటు పడుకోబెట్టుకోవాలి''.

''అక్షరాలు అన్నీ సరిగ్గా పలుకుతున్నాడో లేదో తెలుసుకోవడానికి ఏదైనా మంచి పుస్తకం చదివించాలి'' అంది ఉష అత్తయ్య.

''బాగుంది నీ వరస! నిద్రలో నడిచే వాడు, పెళ్లికి ముందు మనతో పాటు పడుకుంటాడంటావా? పెళ్లికొడుకు చేత పుస్తకం చదివిస్తే బాగుంటుందా?'' అన్నాడు ఉషనాన్నగారు.

''పడుకోకపోతే వాడికి నిద్రలో నడిచే అలవాటున్నట్లే. ఆడపిల్లచేత పాటలు పాడించవచ్చు అన్నీ చేయ్యొచ్చు. మొగాడిచేత మాత్రం పుస్తకం చదివిస్తే తప్పా. ఏం తప్పులేదు'' అంది ఉష అత్తయ్య, తను నమ్ముకున్న స్వతంత్ర భావాలు ప్రకటిస్తూ.

''అది సరే! అయిపోయిందేదో అయిపోయింది!. ఈ రెండో అల్లుడూ నిద్రలో నడుస్తాడంటావా'' అని అడిగాడు ఆయన.

''అది ఇప్పుడే ఎలా చెపుతాం? ముందు ముందు గాని తెలియదు'' అంది అత్తయ్య.

''ఈశ్వరో రక్షత్!'' అనుకున్నాడు, రెండో కాన్యాదానం చేసిన ఉష నాన్నగారు.

(వార్త ఆదివారం, 9-05-2004)